సాక్షి నిజామాబాద్

గురువారం । 26 । జనవరి । 2023



దేశ క్షేమం కోసమే బీఆర్‌ఎస్

రాష్ట్రంలోని పథకాలను దేశ ప్రజలకు అందించాలనే ఉద్దేశంతో బీఆర్‌ఎస్ పనిచేస్తుందని ఆర్టీసీ ఛైర్మన్ బాజిరెడ్డి పేర్కొన్నారు.

- 8లో ▸



పసుపును తవ్వేదెట్లా..?

జిల్లాలో పసుపు తవ్వకాలు మొదలయ్యాయి. అయితే కూలీల కొరత కారణంగా రైతులు ఇబ్బంది పడుతున్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం

31.3 /19.7

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉదయం నుంచి చలిగాలులు వీయవచ్చు. రాత్రి చలితీవ్రత పెరుగుతుంది. మంచు తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

పెండింగ్ కేసులను పరిష్కరించాలి



ఖలీల్‌వాడి : జిల్లాలోని ఆయా పోలీస్‌స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న పరిష్కరించాలని డీజీపీ అంజనీకుమార్ వీడియో కాన్ఫరెన్స్‌లో పేర్కొన్నారు. బుధవారం సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీపీ నాగరాజు ఇతర పోలీసు అధికారులతో ఆయన మాట్లాడారు. జిల్లాలోని 13 వర్టికల్ వ్యవస్థల గురించి జిల్లా పోలీసులతో చర్చించారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పీఎస్‌లలో కేసుల దర్యాప్తులో వేగం పెంచాలన్నారు. కోర్టుల్లో ఉన్న కేసుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలన్నారు. పోలీసులు తప్పకుండా హెచ్‌ఆర్‌ఎంఎస్‌ను వాడేవిధంగా చ ర్యలు తీసుకోవాలన్నారు. వీసీలో సీపీ నాగరాజు, డీసీపీ అరవింద్‌బా బు, ఏసీపీలు వెంకటేశ్వర్, ప్రభాకర్, కిరణ్ కుమార్, నారాయణ, మధుసూదన్ రావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం, ఎస్‌బీ ఆఫీస్ సూపరింటెండెంట్‌లు శంకర్, సీసీఆర్ బీ ఎస్సైలు చాందయ్య తదితరులున్నారు.

'మంచిప్ప' నిర్వాసితులకు అండగా ఉంటా



మోపాల్ : మంచిప్ప రిజర్వాయర్ ముంపు నిర్వాసితులకు అండగా ఉంటానని, అక్రమ రీడిజైన్‌ను రద్దుచేసే వరకు, అక్రమ కేసులు ఎత్తేసేవరకు చేపట్టే ఉద్యమంలో తాను ముందుంటానని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్‌లో మంచిప్ప ముంపు నిర్వాసితులు రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ హయాంలో చేపట్టిన ప్రాజెక్టు, తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రీడిజైన్ గూర్చి ఆయనకు నిర్వాసితులు వివరించారు. అక్రమ కేసులు వెంటనే ఎత్తివేయాలని, అరెస్టు చేసి వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రీడిజైన్‌ను రద్దు చేయకుంటే తానే ముందుండి పోరాటం చేస్తానని వారికి హామీనిచ్చారు. అనంతరం జిల్లా అధికారులకు ఫోన్‌చేసి మాట్లాడారు. ప్రాజెక్టు పాతడిజైన్ ప్రకారమే పనులు చేపడుతున్నట్లు నిర్వాసితులకు రాతపూర్వకంగా ఇచ్చి వారి సందేహాలు నివృత్తి చేయాలని అధికారులకు సూచించారు. రేవంత్‌రెడ్డిని కలిసిన వారిలో కమిటీ సభ్యులు ముత్యంరెడ్డి, రాజేష్, సత్యనారాయణ, నవీన్, భాస్కర్, మహేష్, తదితరులున్నారు.

'పరిశోధనల కేంద్రంగా మార్చుతాం'



భిక్కనూరు: భిక్కనూరులోని తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్‌ను పరిశోధనల కేంద్రంగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని వర్సిటీ వైస్ చాన్స్‌లర్ రవీందర్‌గుప్తా పేర్కొన్నారు. బుధవారం ఆయన సౌత్‌క్యాంపస్‌లో సోషల్‌వర్క్ డిపార్టుమెంట్ కంప్యూటర్ ల్యాబ్, డిజిటల్ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషల్ వర్క్ విద్యార్థులు సమాజంతో మమేకమై సేవా దృక్పథంతో ముందుకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ విద్యావర్ధిని, మహాత్మా గాంధీ నేషనల్ కౌన్సిల్ ఫర్ రూరల్ ఎడ్యుకేషన్ మానిటరింగ్ అధికారులు శరత్‌చంద్ర, నవీన్‌కుమార్, ప్రిన్సిపాల్ లావణ్య అధ్యాపకులు వీరభద్రం, అంజయ్య, రాజేశ్వరి, జమీల్‌హైమద్, యాలాద్రి, నర్సయ్య, రమాదేవి, ఏపీఆర్‌వో యాలాద్రి తదితరులు పాల్గొన్నారు. సౌత్‌క్యాంపస్‌లో నిర్వహించిన ఓటర్ల దినోత్సవంలో రిజిస్ట్రార్ విద్యావర్ధినితోపాటు ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నాందేడ్‌లో బీఆర్‌ఎస్ సభ కోసం స్థల పరిశీలన

నిజాంసాగర్: మహారాష్ట్రలోని నాందేడ్‌లో వచ్చే నెల 5న సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బీఆర్‌ఎస్ సభ నిర్వహణ కోసం బుధవారం ఆ పార్టీ ఎమ్మెల్యేలు హన్మంత్‌సింధే, జీవన్‌రెడ్డి, బాల్కసుమన్ పరిశీలించారు. అనంతరం జన సమీకరణకు సంబంధించి అక్కడి మాజీ ఎంపీ కుబేద్‌ను కలిసి చర్చించారు.

విద్యుత్ కోత.. రైతు గోస

- వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరాకు బ్రేక్
- ఎప్పుడొస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని స్థితి
- గ్రిడ్‌లో లోపాలు తలెత్తడం వల్లనే అంటున్న అధికారులు
- యాసంగి పంటలు నష్టపోతామంటున్న కర్షకులు
- మంగళవారం 13 గంటలు, బుధవారం 12 గంటల పాటు కోతలు



నిజామాబాద్ నాగారం /మోర్తాడ్ /బాల్కొండ : అడ్డగోలుగా కరెంట్ కోతలు విధిస్తుండటంతో రైతాంగం ఆందోళన చెందుతోంది. వ్యవసాయానికి 24 గంటల పాటు విద్యుత్ సరఫరాకు కొన్ని రోజుల క్రితమే బ్రేక్ పడింది. మొన్నటి వరకు పగటి పూట 12 గంటలు ఇచ్చి రాత్రిలో నిలిపివేశారు. గత రెండ్రోజులుగా రాత్రీ పగలు తేడా లేకుండా విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నారు. మంగళవారం 24 గంటల్లో 13.10 గంటల పాటు, బుధవారం 12.55 గంటల పాటు కోతలు విధించారు. యాసంగి సీజన్‌కు సంబంధించి వరి, మొక్కజొన్న, ఎర్రజొన్నలు, సజ్జలు, తెల్లజొన్న, నువ్వుల పంటలను సాగు చేస్తున్నారు. వరి, సజ్జ పంటలకు ఎక్కువగా సాగునీరు అందించాల్సి ఉంటుంది. వరి నాట్లు పూర్తి కావడం, పంట ఎదుగుదల దశలో ఉండటంతో సాగునీటిని నిరంతరం అందించాల్సిన అవసరం ఉంది. కోతల వల్ల సరిపడా నీటి సరఫరా కాకపోవడంతో యాసంగి పంటలను ఎలా గట్టెంచుకోవాలని రైతులు తర్జనభర్జన పడుతున్నారు.

250 మెగావాట్ల లోటు

జిల్లాలో వ్యవసాయ కనెక్షన్‌లు లక్ష 79 వేలు ఉన్నాయి. ప్రతినిత్యం 560 మెగావాట్ల విద్యుత్ అవసరం ఉండగా, గత రెండ్రోజుల నుంచి 250 మెగావాట్ల విద్యుత్ లోడు మాత్రమే సరఫరా అవుతోంది. దీంతో ప్రతినిత్యం వ్యవసాయానికి అప్రకటిత కోత విధిస్తున్నారు. డిస్కంకు 1000 మెగావాట్ల లోడ్ లోటు ఉండడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోందని అధికారులు చెబుతున్నారు.

గ్రామం యూనిట్‌గా ఏ సమయంలో వ్యవసాయానికి విద్యుత్‌ను సరఫరా చేస్తారో తెలుపుతూ ట్రాన్స్‌కో సిబ్బంది వివరాలను వెల్లడించేవారు. ప్రస్తుతం ఎలాంటి షెడ్యూల్‌ను ప్రకటించకుండానే విద్యుత్ కోత విధిస్తున్నారు. 220 కేవీ, 135 కేవీ సామర్థ్యం గల సబ్‌స్టేషన్‌ల నుంచి 33 కేవీ సబ్‌స్టేషన్‌లకు విద్యుత్ సరఫరాపై సమాచారం లేకపోవడంతో వ్య వసాయానికి నిర్ణీత సమయం ప్రకటించలేకపోతున్నామని క్షేత్రస్థాయిలో అధికారులు చెబుతున్నారు. విద్యుత్ సరఫరా వేళలపై స్పష్టత లేకపోవడంతో రైతుల్లో గందరగోళం నెలకొంది.

రెండ్రోజుల విద్యుత్ సరఫరా ఇలా..

మంగళవారం	
మధ్యాహ్నం 2 గంటలకు నిలిపివేత	
సాయంత్రం 4 గంటలకు పునరుద్ధరణ	
సాయంత్రం 4.50 గంటలకు నిలిపివేత	
రాత్రి 11.40 నుంచి ఉదయం 4 గంటల వరకు సరఫరా	
బుధవారం	
ఉదయం 4 గంటలకు నిలిపివేత	
ఉదయం 9.45 గంటలకు సరఫరా	
మధ్యాహ్నం 2 గంటలకు నిలిపివేత	
రాత్రి 10.10 గంటలకు సరఫరా	

24 గంటల పాటు విద్యుత్ సరఫరా లేకపోయినా కనీసం పగటిపూట 12 గంటలు విద్యుత్‌ను సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు. వేసవిలో కరెంట్ కష్టాలు ఎలా ఉంటాయోనని వారు ఆందోళన చెందుతున్నారు.

ఇష్టమున్నట్లు కోతలు



కరెంట్ కోతలు ఇష్టమున్నట్లు విధిస్తున్నారు. రెండు రోజుల నుంచి కరెంట్ సరఫరాకు లెక్క లేకుండనే ఉంది. ఎప్పుడు పోతుందో.. ఎప్పుడు వస్తుందో తెలియడం లేదు. ఇదివరకు పగలు 12 గంటలిచ్చి రాత్రిలో నిలిపి వేశారు. ఇప్పుడు మరింత దారుణంగా కరెంట్ సరఫరా చేస్తున్నారు. – చిన్నారెడ్డి, రైతు, రెంజర్ల

బావి కాడనే కాపలా..



పైనుంచి మెసెజ్ వస్తేనే కరెంట్ వస్తుందంటున్నారు. బుధవారం నాలుగు గంటలే కరెంట్ ఇచ్చారు. ప్రస్తుతం పసుపు తవ్వకానికి నీటి అవసరం ఎక్కువగా ఉంటుంది. ఈ సమయంలోనే ఇలా కోతలు విధిస్తున్నారు. కరెంట్ కోసం బావికాడనే కాపల కాసే పరిస్థి వస్తుంది. – విజయ్‌రెడ్డి, రైతు ముప్కాల్

పట్టణాల్లోనూ..

గ్రామాల్లోనే కాకుండా పట్టణాల్లోనూ సింగిల్ ఫేజ్ సరఫరాలో అనధికారిక కోతలు విధిస్తున్నారు. ఉదయం, సాయంత్రం సమయంలో 10 నిమిషాల చొప్పున మూడు, నాలుగు సార్లు కరెంట్ పోతోంది. మూడు రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది.

ఆదేశాలను అమలు చేస్తున్నాం

సాగుకు విద్యుత్తు సరఫరా కోసం ఉన్నత అధికారుల ఆదేశాలను అమలు చేస్తున్నాం. విద్యుత్తు తీసివేసే 10 నిమిషాల ముందు సమాచారం వస్తుంది. లోడ్ గురించి అధ్యయనం చేసేందుకు ఈ విధంగా చేస్తున్నారని భావిస్తున్నాం.

– రవి, ట్రాన్స్‌కో ఏఈ, ముప్కాల్ సెక్షన్

సాంకేతిక సమస్యల వల్లే..

సాంకేతిక సమస్యల వల్లనే విద్యుత్ కోతలపై సమాచారం ఉండటం లేదు. గ్రిడ్ సమస్యలను పరిష్కరించిన తర్వాతే సరఫరాలో అంతరాయం సమసిపోతుంది. వ్యవసాయానికి ఇబ్బందులు కలుగకుండా విద్యుత్ సరఫరా చేయాలని ప్రయత్నిస్తున్నాం.

– వినోద్‌కుమార్, ఏడీఈ, మోర్తాడ్, భీమ్‌గల్

రెండు రోజుల్లో యథావిధిగా..

పై నుంచి సరఫరాలో సాంకేతిక సమస్యలు రావడంతో వ్యవసాయానికి మూడు గంటల పాటు కోత విధించడం జరుగుతోంది. రెండు, మూడు రోజుల్లో విద్యుత్ సరఫరా యథావిధిగా ఇస్తాం. రైతులు, వినియోగదారులు అర్థం చేసుకుని సహకరించాలి.

– రవీందర్, ఎస్ఈ, విద్యుత్‌శాఖ

ఏసీడీ చార్జీలు చెల్లించొద్దు

- కాంగ్రెస్ నేతల పిలుపు



లేఖలను చూపుతున్న కాంగ్రెస్ నాయకులు

నిజామాబాద్ సిటీ : విద్యుత్‌శాఖ ప్రజలపై భారంమోపే యాన్యువల్ కరెంట్ చార్జీలు (ఏసీడీ) చెల్లించవద్దని డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి బుధవారం ప్రజలకు బహిరంగ లేఖ రాశారు. ఏసీడీ చార్జీలు పెంచద్దని గ్రామ అభివృద్ధి కమిటీ, కుల సంఘాల పెద్దలకు, జిల్లా ప్రజలకు లేఖలో పేర్కొన్నారు. ఎనిమిదేళ్లుగా సీఎం కేసీఆర్ విచ్చలవిడిగా విద్యుత్ చార్జీలు పెంచుతూ సామాన్య ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం మోపుతున్నారన్నారు. ప్రజలపై గతేడాది లోడ్ డిపాజిట్ పేరుతో ఒక్కో సర్వీస్ మీటర్ పై 2 వేల నుండి 5 వేల వరకు వసూలు చేశారని, ఈ ఏడాది ఏసీడీ డిపాజిట్ల పేరుతో అడ్వాన్స్ డిపాజిట్‌ను ఫిబ్రవరి నెలలో చెల్లించాలని విద్యుత్ సంస్థ అధికారులు బిల్లులో కలిపి పంపడం అన్యాయమన్నారు. ఈ లేఖ విడుదల కార్యక్రమంలో నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కేశ వేణు, జిల్లా ఎన్ఎస్‌యూఐ అధ్యక్షులు వేణు రాజ్, జిల్లా ప్రచార కమిటీ చైర్మన్ జావిద్ అక్రమ్, నిజామాబాద్ బ్లాక్ ఏ అధ్యక్షులు కేశ మహేష్, కేశరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖలో సెలవుల రగడ

నిజామాబాద్‌అర్బన్ : జిల్లా విద్యాశాఖలో సెలవులు రద్దు చేస్తూ డీఈవో దుర్గాప్రసాద్ ఉత్తర్వులు జారీ చేయడంపై ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. టీచర్ల బదిలీలు పదోన్నతులయ్యేవరకు ఎలాంటి సెలవులు ఉండకూడదని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీఈవో మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులను ఎంఈవోలు తప్పక పాటించాలని ఆదేశించారు. అయితే విషయమై తెలంగాణ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు పెంట జలంధర్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెనిగల్ల సురేష్, యూటీఎఫ్ నాయకులు, తపాస్ అధ్యక్ష కార్యదర్శులు నిరసన వ్యక్తం చేశారు. ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఓటుహక్కు విలువ తెలుసుకోవాలి



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ నారాయణ రెడ్డి, సీపీ నాగరాజు, అడిషనల్ కలెక్టర్లు

- జాతీయ ఓటరు దినోత్సవంలో కలెక్టర్ పిలుపు
- ఓటింగ్‌లో పాల్గొని భవితను నిర్దేశించుకోవాలని హితవు

సుభాష్‌నగర్ : ప్రజాస్వామ్యంలో ఎంతో కీలకమైన ఓటుహక్కు విలువను ప్రతిఒక్కరూ గుర్తెరగాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. 18ఏళ్లు నిండిన వారందరూ ఓటరుగా నమోదు కావడంతో పాటు, ఎన్నికల్లో తప్పనిసరిగా తమ ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. 13 వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కొత్త కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్ అధ్యక్షత వహించగా, పోలీస్ కమిషనర్ నాగరాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ సందేశం అనంతరం, జిల్లా పాలనాధికారి ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సుమారు 94 కోట్ల 50 లక్షల పైచిలుకు ఓటర్లు కలిగిన భారతదేశ ఎన్నికల వ్యవస్థ ప్రపంచంలోనే అతి పెద్దదన్నారు. అయినప్పటికీ ఓటుహక్కు ద్వారా ఎంతో పారదర్శకంగా, సాఫీగా మనల్ని పరిపాలించే నాయకులను మనం ఎన్నుకోగల్గుతున్నామన్నారు. పోలీస్ కమిషనర్ కేఆర్ నాగరాజు మాట్లాడుతూ 18 ఏళ్ల దాటిన ప్రతిపౌరుడికి రా జ్యాంగం ఓటు హక్కు ప్రసాదించిందని అన్నారు. ఓటుహక్కు ప్రాముఖ్యత, ఔన్నత్యం గురించి యువత ప్రతిఒక్కరికి అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటుచేసిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానంచేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, చంద్రశేఖర్, నిజామాబాద్ ఆర్డీఓ రవి, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డీలర్లకు సులువుగా లైసెన్స్‌లు

- ఒకేచోటికి విత్తన, ఎరువులు, పురుగు మందుల విభాగాలు
- కొత్త మాడ్యూల్‌లోకి ఓఎల్‌ఎంఎస్ పోర్టల్
- మొబైల్ నుంచే దరఖాస్తు చేసుకునేలా వెసులుబాటు
- ఈ నెల 26నుంచి పూర్తిస్థాయిలో అమలుకానున్న నూతన విధానం
- జిల్లాలోని డీలర్లకు శిక్షణ ఇస్తున్న వ్యవసాయ శాఖ



మార్పులు చేసిన ఓఎల్‌ఎంఎస్ పోర్టల్ ముఖచిత్రం



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

ఇందూరు(నిజామాబాద్ అర్బన్) : ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు విక్రయించే డీలర్లకు లైసెన్స్ సేవలు సులభతరం కానున్నాయి. డీలర్లు దరఖాస్తు చేసుకునే ఆన్‌లైన్ లైసెన్స్ మేనేజ్‌మెంట్ సిస్టం (ఓఎల్‌ఎంఎస్) పోర్టల్‌ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మరింత మెరుగుపర్చింది. సైలెన్స్ కేటగిరిలో ఇదివరకు విడివిడిగా ఉన్న సీడ్స్, ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్ విభాగాలను ఒకే దగ్గరికి చేర్చింది. ఒక్క క్లిక్‌తో డీలర్లే నేరుగా తమ మొబైల్ ఫోన్ ద్వారా దరఖాస్తు చేసుకునేలా సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. అయితే పోర్టల్‌లో జరిగిన మార్పులు, చేర్పులపై హోల్‌సేల్, రిటైల్ డీలర్లకు జిల్లా వ్యవసాయాధికారులు మండలస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నూతన విధానాన్ని ఇదే నెల 26వ తేదీ నుంచి పూర్తిస్థాయిలో అమలు చేయడానికి కసరత్తు చేస్తున్నారు. జిల్లాలో 480కి పైగా ఫర్టిలైజర్స్, 600 వరకు సీడ్స్, 350కిపైగా పెస్టిసైడ్స్ దుకాణాలున్నాయి. ఇంకా కొత్త దుకాణాల కోసం దరఖాస్తులు వస్తూనే ఉన్నాయి. ఇది వరకు కొత్త లైసెన్సులు పొందాలన్నా, గడువు ముగిసిన లైసెన్స్‌లను రెనువ్యల్ చేసుకోవాలన్నా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని హార్డ్‌కాపీని వ్యవసాయాధికారులకు ఇచ్చేవారు.

డీలర్లకే లాగిన్ ఐడీ, పాస్వర్డ్

చేసిన దరఖాస్తు పత్రాలతో డీలర్లు ఆఫీసుల చుట్టూ తిరిగే పని తప్పనుంది. నేరుగా వారి మొబైల్ ఫోన్ నుంచి దరఖాస్తు చేసుకుంటే నిర్ణీత గడువులోగా లైసెన్స్‌లు జారీ కానున్నాయి. ఇందుకు డీలర్లకు లాగిన్ ఐడీ, పాస్వర్డ్‌లను ఇవ్వనున్నారు. పోర్టల్‌లో లాగినైతే సీడ్స్, ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అని మూడు విభాగాలు కనిపిస్తాయి. వాటికి సంబంధించిన డీలర్లు కొత్త లైసెన్సులు, రెన్యువల్‌కు దరఖాస్తు చేసుకోవడానికి అందులోనే ఆప్షన్‌ను పొందుపర్చారు. దరఖాస్తు ఫార్మాట్‌ను ఓపెన్ చేసి వివరాలు ఎంట్రీ చేస్తే సరిపోతుంది. కాగా, దుకాణాల లొకేషన్‌లు, అడ్రస్‌ల మార్పిడికి కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. డివిజన్ స్థాయిలో ఐతే ఏడీఏలు, జిల్లా స్థాయిలో డీఏవో లైసెన్స్‌లు జారీ చేస్తారు.

ఇకపై పోర్టల్‌లోనే..

త్వరలో అందుబాటులోకి రానున్న ఓఎల్‌ఎంఎస్ నూతన విధానాన్ని జిల్లాలోని డీలర్లందరూ తప్పనిసరిగా వినియోగించాలి. కొత్త లైసెన్సులు, గడవు ముగిసిన వాటికి రెన్యువల్ చేసుకోవడానికి సర్వీసులన్నీ ఒకచోటుకి చేర్చారు. డీలర్లకే లాగిన ఐడీ, పాస్వర్డ్ ఉంటుంది. మొబైల్ ఫోన్ ద్వారా కూడా సులభంగా దరఖాస్తు చేసుకోవచ్చు.

– తిరుమల ప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి

అంతా నాసిరకమే..

- రూ. 40 లక్షలు నీళ్ల పాలు
- గంగాస్థాన్ ఫేస్–2 పార్కు పనులు అస్తవ్యస్తం
- ఎమ్మెల్యే బాజిరెడ్డికి ఫిర్యాదు



గంగాస్థాన్ ఫేస్–2లో పెచ్చులూడిన ఓపెన్‌జిమ్



పార్కులో మూలన పడ్డ ఆట వస్తువులు

నిజామాబాద్‌నాగారం : ఆహ్లాదం కోసం నిర్మించే పార్కుల్లో కాంట్రాక్టర్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ శాఖాధికారుల నిర్లక్ష్యం కాంట్రాక్టర్ ఇష్టారాజ్యాంతో గంగాస్థాన్ ఫేస్–2లో రూ. 40 లక్షలతో చేపట్టిన పార్కు ఏడా దికే అధ్వానంగా, అస్తవ్యస్తంగా మారింది. దీంతో గంగాస్థాన్–2 రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డికి విన్నవించగా కాంట్రాక్టర్ బాగోతం బయటకు వచ్చింది.

ఏడాదిన్నర పాటు..

నగరంలోని 3వ డివిజన్‌లో గంగాస్థాన్ ఫేస్–2లో సుమారు ఎకరం స్థలంలో పార్కు అభివృద్ధికి రూ. 40 లక్షలు రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సహకారంతో ఏడాదిన్నర క్రితం మంజూరయ్యాయి. అప్పటినుంచి పనులు సాగుతూనే ఉన్నాయి. కేవలం ఓపెన్‌జిమ్ హడావుడిగా నిర్మించి వదిలేయడంతో జిమ్ ఫ్లోరింగ్ పూర్తిగా చెడిపోయింది. పరికరాలు కూడా అంతంత మాత్రంగానే అమర్చారు. పార్క్ పరిసరాల్లో మొరం వేయాల్సి ఉన్నా వేయ లేదు. దీంతో పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. కనీసం పార్క్‌కు శిలాఫలకం కూడా వేయలేదంటే పనులు ఏవిధంగా జరుగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు.

ఫిర్యాదుతోనే..

రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ గంగాస్థాన్ ఫేస్–2కు పర్యటనకు రావడంతో గంగాస్థాన్–2 రెసిడెన్సియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విన్నవించారు. దీంతో ఎమ్మెల్యే బాజిరెడ్డి పార్కును సందర్శించి అవాక్కయ్యారు. ఇది పార్కేనా అంటూ సంబంధిత ఏఈపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత కాంట్రాక్టర్ ఇష్టారాజ్యాంగా పనులు చేయడంపై మండిపడ్డారు. పనులు పూర్తి చేయకుండా బిల్లు ఏవిధంగా ఇచ్చారని అధికారులను ప్రశ్నించారు. దీనికి సంబంధించి పూర్తి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. పెండింగ్ పనులు పూర్తి చేయించి అభివృద్ధి చేయాలని లేకుంటే చర్యలు తప్పవని అధికారులను ఆయన హెచ్చరించారు.

పనులు పూర్తికాకుండానే బిల్లులు

ఏడాదిన్నరగా పనులు కొనసాగుతూనే ఉన్నప్పటికీ నిధులు మాత్రం కాంట్రాక్టర్‌కు పూర్తిగా మంజూరు చేయడం విస్మయం కలిగిస్తోంది. కనీసం పనులు ఏ విధంగా జరిగాయి.. జరుగుతున్నాయనే విషయాన్ని కూడా పరిశీలించకుండానే అధికారులు కాంట్రాక్టర్‌కు రూ. 40 లక్షలు కేటాయించేయడం విచిత్రంగా ఉంది. క్షేత్రస్థాయిలో సంబంధిత ఏఈ పనులు పరిశీలిస్తే ఏవిధంగా ఉన్నాయో తెలిసేది. అలా కాకుండా నీకింత.. నాకింత అన్నట్లు పంపకాలు జరిగి కాంట్రాక్టర్‌కు బిల్లులు మంజూరు చేసినట్లు తెలుస్తోంది.

జెండా పండుగకు సర్వం సిద్ధం

- ముస్తాబైన కొత్త కలెక్టరేట్
- ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్ నారాయణరెడ్డి

సుభాష్‌నగర్ : రిపబ్లిక్ డేను పురస్కరించుకుని నూతన కలెక్టర్ కార్యాలయ సముదాయంలో నిర్వహించనున్న వేడుకల ఏర్పాట్లను కలెక్టర్ నారాయణరెడ్డి బుధవారం పరిశీలించారు. ఉదయం 10.00 గంటలకు కలెక్టర్ పతాకావిష్కరణ చేయనుండగా, ప్రజా ప్రతినిధులు, పుర ప్రముఖులు, ప్రజలు పాల్గొననున్నారు. కొత్త కలెక్టరేట్ సముదాయం అందుబాటులోకి వచ్చాక మొదటిసారిగా రిపబ్లిక్ డే జరుగుతున్నందున పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ సూచించారు. కొత్త కలెక్టరేట్‌ను అందంగా ముస్తాబు చేశారు. ఆయా శాఖల ద్వారా అమలవుతున్న కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని వివరించేలా స్టాల్స్ ఏర్పాటుచేస్తున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, పోలీస్ పరేడ్ తదితర కార్యక్రమాల గురించి సంబంధిత అధికారులతో కలెక్టర్ ఇదివరకే సమీక్షించారు.



ముస్తాబైన కొత్త కలెక్టరేట్ ప్రాంగణం

ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలి

ఆర్మూర్: ప్రభుత్వ ఉపాధ్యాయులకు సెలవులు మంజూరు చేయొద్దని జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ ఇచ్చిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలయ్య, రాజన్నలు ఒక ప్రటకలో తెలిపారు. సెలవులు ఇవ్వకూడదని ఉత్తర్వులు జారీ చేయడం నియంతృత్వ పోకడలకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రస్తుతం పదోన్నతులు, బదిలీలు జరుగుతున్న తరుణంలో ఖచ్చితంగా సెలవు తీసుకోవాల్సి వస్తుందన్నారు. కాగ తక్షణమే ఉత్తర్వులను నిలుపుదల చేయాలని డీఈవోకు విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమం చేపడతామన్నారు.

అనుమతులు గోరంత.. తవ్వేది కొండంత..

- ఇష్టారీతిన మొరం తవ్వకాలు
- మాయమవుతున్న కుంటలు, గుట్టలు
- పట్టించుకోని అధికారులు


కుంటలో వేసిన మొరం


బోర్లం శివారులో గుట్టలను తవ్వుతున్న పొక్లెయిన్లు

బాన్సువాడ టౌన్: పలువురు అక్రమార్కులు అక్రమార్జనే ధ్యేయంగా యంత్రాలతో ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారు. దీంతో ప్రకృతికి నిలయాలుగా ఉన్న గుట్టలు, కుంటలు మాయమవుతున్నాయి. అనుమతుల పేరిట ఇష్టారీతిన మొరం తవ్వకాలు జరుపుతుండటంతో గుట్టలు గుల్లవుతున్నాయి. వందల సంఖ్యలో టిప్పర్లు మొరంను ప్రభుత్వ అభివృద్ధి పనులకు, ప్రైవేటు వెంచర్లకు తరలిస్తున్నాయి. దీంతో ఒక్కప్పుడు ఇక్కడ గుట్టలు ఉండేవి అనే విధంగా ఆయా ప్రాంతాలు మారుతున్నాయి.

ప్రైవేటు వెంచర్లకు...

బాన్సువాడ శివారులోని బోర్లం దారిలో గల గుట్ట సర్వే నంబర్ 357లో 500 టిప్పర్ల మొరం తీసేందుకు కాంట్రాక్టర్ రెవెన్యూ అధికారుల వద్ద అనుమతి తీసుకున్నారు. పట్టణంలోని ఎస్ఆర్ఎన్కే డిగ్రీ కళాశాల వద్ద నూతనంగా నిర్మిస్తున్న నర్సింగ్ కళాశాల కోసం ఈ మొరంను తరలించనున్నారు. కానీ ఇదే అదునుగా చేసుకున్న పిట్లం మండలానికి చెందిన జేసీబీలు, టిప్పర్ల యాజమాని కొన్ని మొరం టిప్పర్లను నర్సింగ్ కళాశాలకు తరలిస్తూ.. మరి కొన్నింటిని ప్రయివేటు వెంచర్లకు తరలిస్తు అక్రమార్జనకు పాల్పడుతున్నాడు. నిర్ధేశించిన ప్రకారం కాకుండా ఇష్టారీతిన తవ్వకాలు జరిపి సొమ్ము చేసుకుంటున్నారు. తవ్వకాలు ఎంతమేర తవ్వారనే విషయాన్ని రెవెన్యూ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సి ఉండగా, వారు అటువైపు కన్నెతి చూడకపోవడం శోచనీయం. దీంతో ప్రకృతిమయమైన గుట్టలు కనుమరుగవుతున్నాయి. అలాగే గుట్టల పక్కనే ఉన్న కుంటలను మొరంతో పూడ్చి వేసి పాట్లుగా మార్చే ప్రయత్నం చేస్తున్నారు. ప్రస్తుతం ఆయా కుంటల కింద రైతులు వరినాట్లు వేస్తున్నారు. కుంటలను పూడ్చి వేస్తే మా పంటలను ఎలా రక్షించుకోవాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మొరం అక్రమ తవ్వకాలను అరికట్టాలని, ప్రకృతి సంపదను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

అనుమతులు తీసుకున్నారు..

నర్సింగ్ కళాశాల కోసం కాంట్రాక్టర్ 500 టిప్పుల మొరం కోసం అనుమతులు తీసుకున్నారు. నిర్ధేశించిన మేరకే తవ్వకాలు జరపాలి. లేదంటే చర్యలు తీసుకుంటాం. అనుమతులు లేకుండా మొరం తవ్వకాలు జరిపితే జేసీబీలను, టిప్పర్లను సీజ్ చేస్తాం. కేవలం అభివృద్ధి పనులకే మొరం తరలించాలి. వెంచర్లకు తరలిస్తే చర్యలు తీసుకుంటాం.

–గంగాధర్, తహసీల్దార్, బాన్సువాడ

దేశ సంక్షేమం కోసమే బీఆర్ఎస్ స్థాపన

- ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్
- తొర్లికొండలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

జక్రాన్‌పల్లి: తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశ ప్రజలకు అందించాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీని స్థాపించారని టీఎస్ ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పేర్కొన్నారు. మండలంలోని తొర్లికొండలో బుధవారం పలు అభివృద్ధి పనులకు ఆయన ఎమ్మెల్సీ వీజీగౌడ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అలాగే గ్రామంలో రేణుకా ఎల్లమ్మ ఆలయం, క్రీడా ప్రాంగణం, వైకుంఠధామాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో బీజేపీని భూస్థాపితం చేయడం ఖాయమన్నారు. ప్రస్తుతం దేశ ప్రజలు సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటు న్నారని అన్నారు. జెడ్పీటీసీలు బాజిరెడ్డి జగన్, త నుజారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ విమల, సర్పంచ్ అక్కపత్రి సురేష్, ఎంపీటీసీ పద్మ, ఉపసర్పంచ్ భూమేశ్వర్, సొసైటీచైర్మన్ అన్వేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


డబుల్ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్

పసుపును తవ్వేదెట్లా?

- వేధిస్తోన్న కూలీల కొరత
- గంటల చొప్పున తవ్వకానికి ఆసక్తిచూపుతున్న కూలీలు
- రైతులకు భారమవుతున్న వైనం


రెంజర్ల శివారులో ఉదయం నుంచే పసుపును తవ్వుతున్న కూలీ

బాల్కొండ: ప్రస్తుతం పసుపు తవ్వకాలు జోరందుకున్నాయి. దీంతో పసుపు తవ్వకాలకు కూలీల కొరత తీవ్రంగా ఉంది. ఈక్రమంలో పసుపురైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎకరం పసుపు పంట తవ్వడానికి 20మంది మగ కూలీలు, 40 మంది మహిళ కూలీలు అవసరం ఉంటుంది. రోజంత మగవారికి పసుపు తవ్వటకు రూ.800 కూలీ ఉంది. మహిళలకు రోజుకు రూ.300 కూలీ ఉంటుంది. ఉదయం 9 గంటలకు వెళ్లి సాయంత్రం 5గంటల వరకు పసుపు తవ్వాలి. మధ్యలో గంట సమయం భోజన విరామం ఉంటుంది. అంటే 7 గంటలు పని చేయాల్సి ఉంటుంది. కానీ రోజంతా పని చేయడానికి కూలీలు ఆసక్తి చూపడం లేదు.

గంటకు రూ.200 కూలీ..

గతంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు కూలీలు పనిచేసేవారు. ప్రస్తుతం పసుపు తవ్వడానికి కూలీలు గంటల చొప్పున కూలీకి వస్తున్నారు. గంటకు రెండు వందల రూపాయల చొప్పున రైతులు కూలీలకు చెల్లిస్తున్నారు. దీంతో కూలీలు ఉదయం నుంచే పసుపు తవ్వకాలను చేపడుతున్నారు. ఉదయం 6గంటల నుంచి 10 గంటల వరకు తవ్వకాలకు వెళ్తున్నారు. గతంలో రోజంతా పని చేస్తే వచ్చే డబ్బులు ప్రస్తుతం నాలుగు గంటల పనికి వెళ్తే వస్తున్నాయి. దీంతో కూలీలు గంటల చొప్పున కూలీకి ఆసక్తి చూపుతున్నారు. ఈక్రమంలో ఎకరానికి రూ.30 వేలు తవ్వకాలకే అవుతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఉడికించి, ఆరబెట్టి శుద్ధి చేయడానికి మరింత ఖర్చు అవుతుంది. ఇలా లెక్కిస్తే ఎకరానికి రూ. 40వేల వరకు తవ్వకం నుంచి మార్కెట్‌కు తరలించే వరకే అవుతుందంటు రైతులు ఆవేదన చెందుతున్నారు.

హాల్‌మార్క్ బంగారాన్ని కొనాలి


అవినాష్ బాబును సన్మానిస్తున్న వర్తకుల సంఘ ప్రతినిధులు

నిజామాబాద్ సిటీ: ప్రతి వినియోగదారుడు బంగారం కొనుగోలు చేసేముందు హాల్‌మార్క్ ముద్ర ఉంటేనే కొనుగోలు చేయాలని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్, మినిస్టరీ ఆఫ్ కంజుమర్ అపెక్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియన్ హైదరాబాద్ బ్రాంచ్ శాస్త్రవేత్త, డిప్యూటీ కమిషనర్ అవినాష్ బాబు, ప్రశాంతిలు పేర్కొన్నారు. నగరంలోని మర్చంట్ అసోసియేషన్ భవనంలో బుధవారం ది నిజామాబాద్ గోల్డ్ అండ్ సిల్వర్ మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హాల్‌మార్క్ జ్యువెలరీ అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశానికి వారు ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. దేశవ్యాప్తంగా హాల్‌మార్క్ కేంద్రాలు 250ఉన్నాయని, నిజామాబాద్‌లో కూడా హాల్‌మార్క్ కేంద్రం ఏర్పాటు చేసుకోవాలన్నారు. హాల్‌మార్క్ పెట్టుకుంటే కలిగే లాభాల గురించి వ్యాపారులకు వివరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీకాంత్, ప్రధాన కార్యదర్శి పసుల రాజ్‌కుమార్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

షుగర్స్ ఫ్యాక్టరీ సిబ్బంది నిర్బంధం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలకేంద్రంలో బుధవారం అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీ సిబ్బందిని స్థానిక రైతులు నిర్బంధించారు. ఫీల్డ్‌మెన్‌లు, ఫీల్డ్ ఆఫీసర్ల చేతులు తడపనిదే ఫ్యాక్టరీకి చెరుకును తరలించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యాలయానికి తాళాలు వేసి నిరసన వ్యక్తం చేశారు. ముందు వేసిన చెరుకును కాకుండా వెనక వేసిన చెరుకును తరలించడంలో అంతర్యమేంటని ప్రశ్నించారు. సమాచారం అందుకున్న పోలీసులు రైతులను సముదాయించి,సిబ్బందిని విడిపించారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



పెద్దకొడప్‌గల్(జుక్కల్): ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైబర్ నేరాలపై, రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి తెలిపారు. సీఐ కృష్ణ, ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి, ఎస్సై విజయ్‌కొండ పాల్గొన్నారు.

విద్యార్థినితో ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన

ఖలీల్ వాడి: నగరంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడు ఓ విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో విద్యార్థిని తల్లిదండ్రులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతకుముందు విద్యార్థిని విషయాన్ని తల్లిదండ్రులకు తెలపడంతో వారు పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయుడిని నిలదీశారు. దీంతో అక్కడ కొంత వాగ్వాదం జరిగినట్లు తెలుస్తోంది. చివరకు విద్యార్థిని తల్లిదండ్రులు రెండోటౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈవిషయమై ఎస్సై పూర్ణేశ్వర్‌ను వివరణ కోరగా విద్యార్థిని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు టీచర్ అరవింద్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి


ప్రమాదంలో దెబ్బతిన్న ద్విచక్ర వాహనం


మృతిచెందిన పోశెట్టి

మాక్లూర్: మండలంలోని చిక్లీ శివారులోని మూల మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందగా.. ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన పోశెట్టి (55), సాదు, గంగాధర్ అనే ముగ్గురు వ్యక్తులు బుధవారం ఒకే బైకుపై కొత్తపల్లి నుంచి జన్నెపల్లి సంతకు బయలుదేరారు. మార్గమధ్యలో వీరు చిక్లీ శివారులోని మూలమలుపు వద్ద గల స్తంభానికి ఢీకొని గాయపడ్డారు. స్థానికులు వెంటనే వారిని ఆస్పత్రికి తరలించగా మార్గమధ్యలో పోశెట్టి మృతిచెందాడు. మిగిలిన ఇద్దరు చికిత్స పొందుతున్నట్లు తెలిసింది. ఈ ప్రాంతంలో తరచు ప్రమాదాలు జరుగుతున్నందున ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

చెరువులో పడి బాలుడు..

బాన్సువాడ టౌన్: పట్టణంలోని కల్కి చెరువులో ఓ బాలుడు ప్రమాదవశాత్తు పడి మృతిచెందినట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. వివరాలు ఇలా.. ఈ నెల 23న బాన్సువాడ కల్కి చెరువు కట్టపై చెప్పులు ఉండటాన్ని గమనించిన పోలీసులు గుర్తు తెలియని వ్యక్తి చెరువులో పడినట్లు నిర్ధారించి గజ ఈతగాళ్లచే మృతుదేహం కోసం గాలించారు. బుధవారం ఉదయం మృతదేహం లభ్యం కావడంతో పంచనామా కోసం ఆస్పత్రికి తరలించారు. బాలుడి మృతదేహం ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మృతుడి తండ్రి అంబయ్య ఆస్పత్రికి వెళ్లి చూడగా మృతదేహం తన కుమారుడిదేనని గుర్తుపట్టారు. పాఠశాలకు వెళ్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన జగన్‌దాస్ కల్కి చెరువు కట్టపై ఉన్న బారికేట్లపై కూర్చొని ఉండగా ప్రమాదవవాత్తు చెరువులో పడిపోయి ఉంటాడని, మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని అంబయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..

బాన్సువాడ రూరల్: విద్యుత్‌షాక్‌కు గురైన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు సీఐ మహేందర్‌రెడ్డి బుధవారం తెలిపారు. వివరాలు ఇలా.. మండలంలోని దేశాయిపేట్ గ్రామానికి చెందిన దుర్కికర్ గంగారాం(60) ఎలక్ట్రిషన్ పనులు చేసేవాడు. ఈనెల 24న పోచారం శివారులోని మల్లిక్‌పాషా తన కోళ్లఫారంలో విద్యుత్ మరమ్మతులు కోసం గంగారాంను పిలిచాడు. ఈక్రమంలో ఎజాస్ అనే వ్యక్తి బైక్‌పై అతడిని తీసుకువెళ్లాడు. అనంతరం విద్యుత్ పనులు చేస్తుండగా గంగారాం విద్యుత్‌షాక్‌కు గురైయ్యాడు. స్థానికులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం బాన్సువాడ ఏరియా అస్పత్రికి తరలించారు. కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గంగారాం బుధవారం మృతి చెందాడు. తన తండ్రి మృతిపై విచారణ చేపట్టాలని అతని కుమారుడు సత్యం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు.

చెరుకు ట్రాక్టర్ బోల్తా



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): పట్టణ శివారులో బుధవారం ప్రమాదవశాత్తు చెరుకు ట్రాక్టర్ బోల్తా పడినట్లు స్థానికులు తెలిపారు. మండలంలోని కట్టకిందతండా నుంచి నిజాంసాగర్ మండలంలోని మాగి షుగర్ ఫ్యాక్టరీకి చెరుకును తరలిస్తున్న ట్రాక్టర్ ప్రమాదవశాత్తు బోల్తా పడినట్లు వారు తెలిపారు. ప్రమాదంలో ఎవరికి గాయాలు కాలేదన్నారు. రోడ్డుపై చెరుకు ట్రాక్టర్ బోల్తా పడడంతో ట్రాఫిక్‌కు కొంత అంతరాయం కలిగింది.

కారులో పెట్రోల్ పోయించుకొని పరారీ


సీసీ కెమెరాలో రికార్డయిన కారు నంబర్

భిక్కనూరు: సిద్దరామేశ్వరనగర్ శివారులోని జాతీయ రహదారి పక్కన గల పెట్రోలు బంకులో ఓ వ్యక్తి కారు ట్యాంక్ నిండ పెట్రోలు పోయించుకొని డబ్బులు ఇవ్వకుండా పరారయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. హైదరాబాద్ వైపు నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్న కారు (యుపి. 32కెఆర్0077) వాహనం స్థానిక శ్రీవల్లి పెట్రోల్ బంకులోకి వచ్చింది. కారు డ్రైవర్ బంకు వద్ద కారును తీసుకవచ్చి ట్యాంక్ నిండా పెట్రోలు నింపుమని హిందీలో కోరాడు. బంకు సిబ్బంది కారులో సుమారు రూ.4,700 విలువ గల పెట్రోలు పోసి, డబ్బులు అడిగారు. కారు డ్రైవర్ స్వైప్ మిషిన్ తీసుకురమ్మని సిబ్బందికి సూచించాడు. సిబ్బంది స్వైప్ మిషిన్ కోసం వెనక్కి తిరుగగా డ్రైవర్ కారును స్టార్ట్ చేసి, వెళ్లిపోయాడు. బంక్ సిబ్బంది కారును ఆపేందుకు యత్నించగా స్వల్పంగా గాయపడ్డాడు.

నాటుసారా స్వాధీనం

సిరికొండ: మండలంలోని తాటిపల్లి గ్రామంలో నాటుసారా తయారు చేస్తున్న మూడు ఇళ్లపై బుధవారం దాడి చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై నర్సింలు తెలిపారు. మాలావత్ దేశాయి, బుక్యా దేవులా, బుక్యా జయల వద్ద తొమ్మిది లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో నిజామాబాద్ డీటీఎఫ్ ఎస్సై గంగాధర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై రాంకుమార్ సిబ్బంది పాల్గొన్నారు. గ్రామాల్లో ఎవరైన నాటు సారా తయారు చేస్తే, వారి వివరాలు అందించాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని ఎస్సై తెలిపారు. నాటు సారాను ఎవరు కూడా తయారుచేయవద్దని, తయారు చేసేవారిపై చట్టరీత్య తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాలికపై అత్యాచారం కేసులో 20ఏళ్ల జైలు

కామారెడ్డి టౌన్: బాలికపై అత్యాచారం చేసిన ఓ వ్యక్తికి 20 సంవత్సరాలు జైలు శిక్షను విధిస్తూ కామారెడ్డి జిల్లా పోక్సో కోర్టు న్యాయమూర్తి లాల్‌సింగ్ శ్రీనివాస నాయక్ బుధవారం తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ నంద రమేష్ తెలిపిన వివరాలు ఇలా.. జిల్లాలోని మద్నూర్ మండలం లింబూర్ గ్రామంలో గ్రామానికి చెందిన జగదీష్ అనే వ్యక్తి 2022 సంవత్సరంలో ఓ బాలికపై అత్యాచారానికి పాల్పడినట్లు మద్నూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం కోర్టులో న్యాయమూర్తి సాక్షులను విచారించి నిందితుడికి 20సంవత్సరాలు జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. తెలిపారు. అలాగే బాధితురాలికి రూ.5లక్షలను ప్రభుత్వం నుంచి పరిహారం ఇవ్వాలని న్యాయమూర్తి ఆదేశించినట్లు తెలిపారు.